# మన చౌరాస్తా

తెలుగు దినపత్రిక




జర్నలిస్ట్ రబ్బానికి ఘన నివాళి

2


సంపుటి : 01 | సంచిక : 210 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | శుక్రవారం, 03 జులై 2026 | పేజీలు :4




# మహిళా సంఘాల నిధులతో గిరిగిరి దందా..?

- వివోఏల తీరుపై పెరుగుతున్న అనుమానాలు..
- అధికారుల పర్యవేక్షణా లోపం

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా:**

గ్రామీణ మహిళల ఆర్థిక సాధికారతకు అండగా నిలవాల్సిన స్వయం సహాయక సంఘాల నిర్వహణలో కొందరు వివోఏల తీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మహిళా సంఘాల నుంచి వసూలు చేసిన పొదుపు, రుణ వాయిదాలు, ఇతర లావాదేవీల నగదును సకాలంలో బ్యాంకుల్లో జమ చేయకుండా వ్యక్తిగతంగా తిప్పుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారాన్ని స్థానికంగా 'గిరిగిరి ఫైనాన్స్'గా పేర్కొంటున్నారు.

**బ్యాంకుకు చేరని సంఘాల నగదు..**

మహిళా సంఘాల సమావేశాల్లో సభ్యుల నుంచి వసూలు చేసే నగదును అదే రోజు లేదా మరుసటి పని దినంలో బ్యాంకు ఖాతాల్లో జమ చేయాల్సి ఉంటుంది. అయితే కొన్నిచోట్ల రోజుల తరబడి నగదు బ్యాంకుకు చేరడం లేదని సభ్యులు ఆరోపిస్తున్నారు. దీంతో సంఘాల ఖాతాల్లో నగదు వివరాలు, వాస్తవ వసూళ్ల మధ్య వ్యత్యాసాలు ఏర్పడుతున్నాయని తెలుస్తోంది.

**గిరిగిరి దందా ఇలా..**

సంఘాల వద్ద ఉన్న నగదును బ్యాంకులో జమ చేయకుండా తాత్కాలికంగా ఇతరులకు అప్పుగా ఇవ్వడం, ఒకరి వద్ద నుంచి వసూలు చేసిన డబ్బును మరొకరికి ఇవ్వడం, తిరిగి వచ్చిన మొత్తాన్ని మరోచోట వినియోగించడం వంటి చర్యలను స్థానికంగా 'గిరిగిరి ఫైనాన్స్'గా పిలుస్తున్నారు. ఇలాంటి వ్యవహారాలు నిజమైతే మహిళా సంఘాల ఆర్థిక క్రమశిక్షణకు తీవ్ర విఘాతం కలిగించే అంశమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**సభ్యుల్లో పెరుగుతున్న ఆందోళన**

తాము చెల్లించిన పొదుపు, రుణ వాయిదాలు వెంటనే బ్యాంకు ఖాతాల్లో నమోదు కాకపోవడంతో సభ్యులు ఆందోళన చెందుతున్నారు. సంఘాల నిధుల భద్రతపై సందేహాలు వ్యక్తం చేస్తూ, నగదు నిర్వహణలో పూర్తి పారదర్శకత తీసుకురావాలని కోరుతున్నారు.

**పర్యవేక్షణ లోపమే కారణం?**

సంఘాల నగదు వసూళ్లు, బ్యాంకు జమలపై క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ బలహీనంగా ఉండడం వల్లే ఇలాంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. సంబంధిత అధికారులు క్రమం తప్పకుండా రికార్డులు, బ్యాంకు స్టేట్‌మెంట్లు, నగదు లావాదేవీలను పరిశీలించకపోవడం వల్ల అక్రమాలకు అవకాశం కలుగుతోందని పలువురు పేర్కొంటున్నారు.

**సమగ్ర విచారణకు డిమాండ్..**

మహిళా సంఘాల నిధుల నిర్వహణపై జిల్లా స్థాయి అధికారులు ప్రత్యేక ఆడిట్ నిర్వహించాలని, నగదు సకాలంలో బ్యాంకుల్లో జమ కాకపోతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరుతున్నారు. మహిళా సంఘాలపై మహిళల్లో ఉన్న నమ్మకాన్ని కాపాడాలంటే ప్రతి రూపాయి లావాదేవీ పారదర్శకంగా ఉండేలా పటిష్ఠ వ్యవస్థను అమలు చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు.



# చదువే భవిష్యత్తుకు బలమైన పునాది

- ప్రభుత్వం కల్పిస్తున్న ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

3



## నాటేసిన యశస్విని..

**ప్రజల మధ్య ఉండడమే ప్రజా ప్రతినిధి ధ్యేయమనే విషయాన్ని మరోసారి చాటి చెప్పారు పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి. దేవరుప్పల మండలం మాదాపురంలో ఆమె మహిళా వ్యవసాయ కూలీలతో కలిసి వరి నాట్లు వేశారు. అధికారిక కార్యక్రమాలు ముగించుకుని తిరిగి వస్తుండగా, మార్గమధ్యంలో పొలంలో మహిళా కూలీలు వరి నాట్లు వేస్తుండటం గమనించిన ఎమ్మెల్యే వెంటనే వారి వద్దకు వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.**

- దేవరుప్పల, మన చౌరాస్తా



## జర్నలిస్టు రబ్బాని పాషాకు నివాళి

ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సాక్షి డెస్క్ జర్నలిస్ట్ ఎండీ రబ్బాని పాషా చిత్రపటానికి గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో డెస్క్ జర్నలిస్టులు, ప్రెస్ క్లబ్ బాధ్యులు, జర్నలిస్టులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా రబ్బాని పాషా జర్నలిజం రంగంలో చేసిన సేవలను స్మరించుకున్నారు. ఆయన అకాల మరణం జర్నలిస్టు లోకానికి తీరని లోటని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. - మన చౌరాస్తా, వరంగల్

# మాదిగలు బాగా చదవాలి

**– ఎమ్మార్పీఎస్ హుస్నాబాద్ ఇన్‌చార్జి వెంకటస్వామి మాదిగ**

భీమదేవరపల్లి, మన చౌరాస్తా: హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలో మాదిగల సమావేశం నిర్వహించారు. మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు జరిగిన ఈ సమావేశానికి ఎమ్మార్పీఎస్ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి మాట్ల వెంకటస్వామి మాదిగ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మాదిగ సమాజంలో విద్య ప్రాధాన్యతను ప్రతి కుటుంబం గుర్తించాలని అన్నారు. ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులతో పాటు వివిధ కారణాలతో చదువుకు దూరమైన వారిని తిరిగి విద్యాభ్యాసంలోకి తీసుకురావడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అలాగే జూలై 7న ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కంద రమేష్, కంటే సంజీవ్, మాజీ వార్డు సభ్యుడు గజ్జల వెంకటస్వామి, ఎమ్మార్పీఎస్ నాయకులు గజ్జల



ఆశయ్య, మల్లమారి జంపయ్య, గజ్జల ఐలయ్య, కుమారస్వామి, కృపాకర్, రాజయ్య, వీరస్వామి, కడారి స్టీఫెన్, యువకులు, మాదిగ కుల పెద్దలు పాల్గొన్నారు.

# అడుగడుగునా ఆహారంలో కల్తీయే..

**– తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్**

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా:** దేశవ్యాప్తంగా కల్తీ ఆహార పదార్థాల విక్రయాలు విస్తరిస్తున్నప్పటికీ వాటిని అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్ ఆరోపించారు. ఆయన మాట్లాడుతూ గతంలో పండుగల సమయంలో మాత్రమే కల్తీ ఆహార పదార్థాల సమస్య ఉండేదని, ప్రస్తుతం ఉదయం తాగే పాల నుంచి రాత్రి భోజనం వరకు, పిల్లలు వినియోగించే చాక్లెట్లు, నెయ్యి, పన్నీరు, వెన్న, కోవా, చికెన్, మసాలా పొడులు, బేకరీ ఉత్పత్తులు, అల్లం-వెల్లుల్లి పేస్టు, సాస్‌లు వంటి అనేక ఆహార పదార్థాల్లో భారీ స్థాయిలో కల్తీ జరుగుతోందని అన్నారు. ప్రఖ్యాత బ్రాండ్ల పేర్లతో నకిలీ ఉత్పత్తులు తయారు చేయడం, గడువు ముగిసిన వస్తువులకు కొత్త లేబుళ్లు అతికించి విక్రయించడం, కుళ్లిపోయిన ముడి పదార్థాలను రసాయనాలతో శుభ్రపరిచి మళ్లీ మార్కెట్‌లోకి పంపించడం వంటి అక్రమాలు ప్రజల ఆరోగ్యానికి తీవ్ర ముప్పుగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. హోటళ్లు, బేకరీలు, బార్ అండ్ రెస్టారెంట్లు, పెద్ద రిటైల్ దుకాణాల్లో కూడా నాణ్యతలేని ఆహార పదార్థాలు విక్రయిస్తున్నారని, కల్తీ ఆహారం కారణంగా ప్రజలు తీవ్ర అనారోగ్యానికి గురై ప్రైవేట్ ఆస్పత్రుల చుట్టూ తిరుగుతూ ఆర్థికంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు.

**ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల నియామకాలు పెంచాలి**

రాష్ట్ర ప్రభుత్వం ఫుడ్ సేఫ్టీ విభాగంలో ఖాళీగా ఉన్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులను వెంటనే భర్తీ చేసి, తనిఖీలను మరింత కట్టుదిట్టం చేయాలని డిమాండ్ చేశారు. కల్తీ ఆహార పదార్థాల తయారీ, విక్రయాల్లో పాల్గొనే ముఠాలపై నిరంతర నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

**క్రిమినల్ కేసులు నమోదు చేయాలి**

తనిఖీల్లో పట్టుబడిన హోటళ్లు, బేకరీలు, రెస్టారెంట్లను కొద్ది రోజులు సీజ్ చేసి మళ్లీ తెరవడానికి అనుమతించడం వల్ల అక్రమాలు తిరిగి కొనసాగుతున్నాయని అన్నారు. అలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, చట్టపరంగా కఠిన శిక్షలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని



డిమాండ్ చేశారు. కల్తీ ఆహారాన్ని పూర్తిగా అరికట్టి ప్రజల ప్రాణాలను కాపాడేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర పక్షాన చెప్యాల ప్రకాష్ విజ్ఞప్తి చేశారు. ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన ఆహారం అందించడం ప్రభుత్వాల ప్రాథమిక బాధ్యత అని పేర్కొన్నారు.



### రీయింబర్స్‌మెంట్ బకాయిలు

# వెంటనే విడుదల చేయాలి

- **జనగామ జిల్లా బీసీ జేఏసీ కన్వీనర్ మంగళంపల్లి రాజు**
- **కళాశాలల బంద్ విజయవంతం**

**జనగామ, మన చౌరాస్తా:** విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పెండింగ్‌లో ఉన్న రూ.11 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని కొనసాగించాలని జనగామ జిల్లా బీసీ జేఏసీ కన్వీనర్ మంగళంపల్లి రాజు డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ బీసీ జేఏసీ పిలుపు మేరకు జనగామ జిల్లాలో కళాశాలల బంద్ విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ఉన్నత విద్యకు అత్యంత కీలకమైన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని మరింత బలోపేతం చేయాలని కోరారు. పెండింగ్ బకాయిలను తక్షణమే విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కులను కాపాడేందుకు అవసరమైతే భవిష్యత్తులో మరింత ఉధృతంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన అధ్యక్షుడు పిట్టల సురేష్, జిల్లా అధ్యక్షుడు గన్ను కార్తీక్, విద్యార్థి సమాఖ్య జిల్లా అధ్యక్షుడు నల్లా రాహుల్, జిల్లా ప్రధాన కార్యదర్శి తుంగ కౌశిక్, విద్యార్థి సంఘం అధ్యక్షుడు వెంపటి అజయ్, నాయకులు పానుగంటి క్రిష్ణ తదితరులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# అంగన్‌వాడీ టీచర్ నియామకంపై నిరసన

**– స్థానికులకు అన్యాయం జరిగిందంటూ ఆందోళన**

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** భీమదేవరపల్లి మండలంలోని వీరభద్ర గ్రామపంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ పోస్టు నియామకం వివాదాస్పదంగా మారింది. కొత్తపల్లి తండాకు చెందిన గిరిజనులు గురువారం గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తూ స్థానికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నిరసనలో పాల్గొన్న గిరిజనులు మాట్లాడుతూ, గత 8 ఏళ్లుగా అంగన్‌వాడీ టీచర్ పోస్టు ఖాళీగా ఉండగా, ఇప్పుడు ఆ పోస్టును తమ తండాకు చెందిన అర్హత కలిగిన నిరుద్యోగ మహిళలకు కేటాయించకుండా సమీపంలోని మంక్త్యా నాయక్ తండాకు చెందిన వ్యక్తిని నియమించడం అన్యాయమని ఆరోపించారు. స్థానిక అర్హులైన అభ్యర్థులు అందుబాటులో ఉన్నప్పటికీ వారిని పక్కనపెట్టి ఇతర ప్రాంతానికి చెందిన వ్యక్తికి అవకాశం కల్పించడం సరైన విధానం కాదని పేర్కొన్నారు. నియామక ప్రక్రియను అధికారులు పునఃపరిశీలించి, స్థానిక గిరిజన మహిళలకు ప్రాధాన్యత కల్పిస్తూ న్యాయం చేయాలని వారు కోరారు. తమ డిమాండ్లను పట్టించుకోకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

**ప్రమోషన్‌లో భాగంగానే నియామకం: సీడీపీవో**

ఈ విషయంపై సీడీపీవో స్వరూపను వివరణ కోరగా, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రమోషన్‌లో భాగంగా బానోతు కమలను వీరభద్ర గ్రామపంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రానికి టీచర్‌గా నియమించినట్లు తెలిపారు. నియామకం ప్రభుత్వ నిబంధనలు, ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగానే జరిగిందని ఆమె స్పష్టం చేశారు.



# చదువే భవిష్యత్తుకు బలమైన పునాది

- ప్రభుత్వం కల్పిస్తున్న ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**పాలకుర్తి, మన చౌరాస్తా :** చదువే భవిష్యత్తుకు బలమైన పునాది అని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. గురువారం జిల్లాలోని పాలకుర్తి మండలంలో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)ని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా సందర్శించి, విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలు, బోధనా విధానం, వసతి సౌకర్యాలు, పారిశుద్ధ్యం, మధ్యాహ్న భోజనం వంటి వాటిని క్షుణ్ణంగా పరిశీలించారు. ముందుగా 8వ తరగతి తరగతి గదిని సందర్శించిన కలెక్టర్ విద్యార్థులతో ఇంగ్లీష్ పాఠ్యాంశాలను చదివించి, వారి పఠన సామర్థ్యాన్ని పరీక్షించారు. ప్రతి విద్యార్థి స్పష్టంగా చదవగలిగేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అనంతరం ఇంటర్ మొదటి సంవత్సరం తరగతి గదిని సందర్శించి, ఎంత మంది విద్యార్థులు ఉన్నారు? అని వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీసీలో 34 మంది, బైపీసీలో 24 మంది విద్యార్థులు ఉన్నట్లు ఉపాధ్యాయులు కలెక్టర్ కు వివరించారు. అలాగే ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ తరగతిలో విద్యార్థులకు గణితంలో లెక్కలు వేయించి, వారి విషయావగాహనను పరిశీలించారు. గణితంలో సూత్రాలను కేవలం బట్టీ పట్టడం కాకుండా భావనలను పూర్తిగా అర్థం చేసుకోవాలని సూచించారు. ద్వితీయ సంవత్సరం బైపీసీ తరగతిలో జువాలజీకి సంబంధించిన ప్రశ్నలు అడిగి, విద్యార్థుల విషయ పరిజ్ఞానాన్ని పరీక్షించారు. "Peptic acid అంటే ఏమిటి?" వంటి ప్రశ్నలు అడిగి వారి సామర్థ్యాన్ని తెలుసుకున్నారు. 7వ, 9వ తరగతులను కూడా సందర్శించి, విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడారు. 10వ తరగతి గదిని సందర్శించి, అన్ అకాడమీ ఆన్లైన్ తరగతులను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రియల్ నంబర్స్, మెన్సురేషన్, లాగరిథమ్స్ వంటి అంశాలను వివరించారు. విద్యార్థులతో ఆత్మీయంగా మాట్లాడిన కలెక్టర్, వారు ఏ గ్రామానికి చెందిన వారు? వారి తల్లిదండ్రులు ఏం చేస్తారనే? విషయాలపై ఆరా తీశారు. పలువురు విద్యార్థులు తమ తల్లిదండ్రులు రైతులని కలెక్టర్ కు చెప్పారు. విద్యార్థులు అందరూ కష్టపడి చదివి, తల్లిదండ్రులకు అండగా నిలవాలని, చదువే భవిష్యత్తుకు ఆధారం అని ప్రోత్సహించారు. భవిష్యత్తులో పెద్ద విద్యాసంస్థల్లో సీట్లు సాధించే లక్ష్యంతో కష్టపడి చదవాలని, ప్రతిరోజూ కనీసం రెండు గంటలు అదనంగా చదువుకు కేటాయించాలని, ఒక్కరోజు కూడా తరగతులకు గైర్హాజరు కాకుండా క్రమశిక్షణతో చదువుకోవాలని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. పాఠశాలలో వైద్య సేవలను పరిశీలిస్తూ, ఏఎన్ఎం నీరజతో మాట్లాడి, మందుల నిల్వలు, ఐ డ్రాప్స్ అందుబాటులో ఉన్నాయా? అని తెలుసుకున్నారు.
వంటశాలను సందర్శించి, ఆ రోజు మెనూ ప్రకారం వండిన వంటకాల గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వంకాయ కూర, పప్పు తయారు చేసినట్లు సిబ్బంది వివరించారు. డైట్ చార్ట్‌ను వంటగది ముందు ప్రదర్శించాలని, వంటశాలలో పరిశుభ్రతను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. సరకుల స్టోర్ రూమ్ ను పరిశీలించి, వస్తువులను క్రమబద్ధంగా భద్రపరచాలని చెప్పారు. సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేసేలా మరమ్మతులు చేయించాలని, ఆర్వో ప్లాంట్ పనిచేస్తుందో? లేదో? ఆరా తీశారు. పాఠశాల ఆవరణలో కొనసాగుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పాఠశాల పరిసరాల్లో పెరిగిన పిచ్చి మొక్కలను వెంటనే తొలగించి, పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించాలని సూచించారు.విద్యా నాణ్యతతో పాటు విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, పరిశుభ్రత, వసతి సౌకర్యాలన్నింటిలోనూ ఎలాంటి అలసత్వం లేకుండా పాఠశాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు.ఈ పరిశీలనలో విద్యా శాఖ ఏడీ శ్రీనివాస్, తహసీల్దార్ సరస్వతి, ఎంపిడిఓ వేదవతి, ఎంఈవో, ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.








# బస్సు ధ్వంసం కేసు కొట్టివేత

**పాలకుర్తి, మన చౌరాస్తా :** ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కాంగ్రెస్ ప్రతిపక్షాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళనలో నమోదైన బస్సు ధ్వంసం కేసును కోర్టు కొట్టివేసింది.దివంగత మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దుగ్యాల శ్రీనివాసరావు నాయకత్వంలో 2015 అక్టోబర్ 10న జనగాం జిల్లా పాలకుర్తి గుడివాడ చౌరస్తాలో ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఆందోళన కార్యక్రమం నిర్వహించారు.ధర్నా సందర్భంగా ఆర్టీసీ బస్సు పై ఆందోళనకారులు దాడులు చేయడంతో బస్సు ధ్వంసం అయింది.దీంతో బస్సు డ్రైవర్ కొత్తపల్లి రవీందర్ ఫిర్యాదు మేరకు పాలకుర్తి ఎస్ఐ ఉస్మాన్ షరీఫ్ కేసు నమోదు చేశారు. మాజీ ఎమ్మెల్యే దుగ్యాల శ్రీనివాసరావుతో పాటు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ,మాజీ మండల పార్టీ అధ్యక్షులు గిరగాని కుమారస్వామి గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు పోగు శ్రీనివాస్, EX ZPTC బన్నెపాక గణేష్, దేవస్థానం మాజీ చైర్మన్ చిలువేరు కృష్ణమూర్తి, మాజీ ఎంపీపీ కారుపోతుల శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు కోట వెంకటేశ్వర్లు, సలేంద్ర వెంకన్న, పసునూరి నవీన్, గుగ్గిళ్ళ ఆదినారాయణ, ధరావత్ బాలు, ఎండి సలీం,గుగులోతు కిషన్ నాయక్ లపై కేసు నమోదు చేశారు.2015 నుంచి ఇప్పటివరకు వివిధ కోర్టులో విచారణ జరగగా గురువారం హనుమకొండ కోర్టులో కేసును కొట్టివేశారు.దీంతో కాంగ్రెస్ పార్టీ నాయకులకు భారీ ఊరట లభించింది. కేసు నమోదైన వారిలో మాజీ ఎమ్మెల్యే దుగ్యాల శ్రీనివాసరావు, కోట వెంకటేశ్వర్లు మృతి చెందారు.

# ప్రైవేట్ స్కూళ్లలో ఫీజులను నియంత్రించాలి: సీపీఎం



**చిల్పూర్, మన చౌరాస్తా :** చిల్పూర్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల సమస్యలను తక్షణమే పరిష్కరించి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీని నియంత్రించాలని డిమాండ్ చేస్తూ మండల విద్యాధికారి కార్యాలయం ముందు సీపీఎం చిల్పూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం భారీ ధర్నా నిర్వహించారు. అనంతరం మండల విద్యాధికారి గోవర్ధన్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని, గత వారం రోజులుగా సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన సర్వే నివేదికను అందజేశారు.ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, ఘనపూర్ స్టేషన్ నియోజకవర్గ ఇంచార్జి రాపర్తి రాజు మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు అనేక సమస్యలతో సతమతమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరుకోవడం, గదుల కొరత, ఉపాధ్యాయుల కొరతతో పాటు తాగునీరు, ఆటస్థలం, కుర్చీలు, బెంచీలు, ప్రహరీ గోడలు, మరుగుదొడ్లు, ఆట వస్తువులు, కంప్యూటర్ల లాంటి కనీస మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం చొరవ చూపి నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు కల్పించి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని, ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసే విధానాలకు స్వస్తి పలకాలని డిమాండ్ చేశారు. మరోవైపు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ ఇష్టారీతిన ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు విద్యా సంస్థల అక్రమాలపై నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకోకపోతే, పేద విద్యార్థులు చదువుకు దూరమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు.మండలంలో ప్రధానంగా చిన్న పెండ్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నెలకొన్న సమస్యలు ఆందోళనకరంగా ఉన్నాయని, అక్కడ కూలిపోయే స్థితిలో ఉన్న ప్రమాదకరమైన గోడలను వెంటనే తొలగించి, నూతన పాఠశాల భవనం, తరగతి గదులు, ప్రహరీ గోడ నిర్మించి కేజీ నుండి పీజీ తరగతులకు సిద్ధం చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. అలాగే రాజవరం గ్రామపంచాయతీ పరిధిలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయ పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మించి మౌలిక సదుపాయాలు కల్పించాలని, మల్కాపూర్ ఉన్నత పాఠశాలకు నూతన తరగతి గదులు, ప్రహరీ గోడ, మరుగుదొడ్లు కట్టించి, ఆధునిక ప్రయోగశాల ఏర్పాటుతో విద్యార్థులకు రక్షణ కల్పించాలన్నారు. వీటితో పాటు విద్యార్థులందరికీ వెంటనే దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, విద్యార్థి పరికరాల సంచులు (కిట్లు) అందించాలని, అన్ని పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తూ ప్రైవేట్ పాఠశాలల ఫీజులను అదుపు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు సాదం పరమేష్, వార్డు సభ్యులు ఊరడి బుచ్చిరాజు, పోలు శ్రీనివాస్, ముడిక భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

# wanted

## విలేకరులు కావలెను




మన చౌరాస్తా తెలుగు దినపత్రిక స్థాపించిన అనతి కాలంలోనే పాఠకుల విశేష ఆదరణ పొందుతూ డిజిటల్ మీడియా రంగంలో దూసుకెళ్తోంది. స్థానిక సమస్యలపై, రాజకీయ, ఎడ్యుకేషన్, ఆరోగ్యం, సినిమా వార్తలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతూ ముందుకు సాగుతోంది. మా పత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను.. పూర్తి వివరాలకు ఈ కింది నంబర్లలో సంప్రదించగలరు.

**manachourasta@gmail.com**

**8555800812** **9676400812**

Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**